జీడిమెట్ల సీఐగా మల్లేష్


మల్లేష్

జీడిమెట్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల సీఐగా గడ్డం మల్లేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. జీడిమెట్ల సీఐగా బాధ్యత నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్ రావును సైబర్‌క్రైమ్స్‌కు బదిలీ చేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన సీఐకి డీఐ విజయ్‌నాయక్, ఎస్‌ఐలు నాయుడు, హరీష్, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

సూరారం సీఐగా భరత్‌కుమార్


భరత్‌కుమార్

గాజులరామారం: సూరారం సీఐగా భరత్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో గచ్చిబౌలి ఉమెన్స్‌లో సీఐగా విధులు నిర్వహిస్తూ, సూరారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన సీఐ వెంకటేశం లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయాడు.

చివరి బస్టాప్ వద్ద ఆధార్ సెంటర్ ఏర్పాటు

ఓల్డుబోయినపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులో సవరణలు, మార్పులు, కొత్త ఆధార్ కార్డుల నమోదు కోసం ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధి చివరి బస్టాప్ మదార్సాలో ఏర్పాటు చేశారు. సెంటర్ సేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ ప్రజలకు సూచించారు. సోమవారం నుంచి 6వ తేదీ వరకు సెంటర్ పని చేస్తుందని తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్


మార్కేండేయ నగర్‌లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

షాపూర్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలనీలు, బస్తీల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సాయంత్రం అయితే దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ వారు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సూరారం డివిజన్, నెహ్రూనగర్, మార్కండేయనగర్, గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీల్లో ఫాగింగ్ చేశారు. దోమల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

'అనుమతులు లేని అంతస్తుల కూల్చివేత'

దుండిగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామంలోని మాదాస్ రామ్‌చందర్ కాలనీలో అనుమతులు లేని అదనపు అంతస్తులను మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు టీపీఓ సంజన ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం కూల్చివేశారు. ఈ కాలనీలో నాయకుల అండదండలతో విచ్చలవిడిగా అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. ఈ విషయంపై ఆలస్యంగా దృష్టి సారించిన మున్సిపల్ అధికారులకు పలు ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ కాలనీలో అనుమతి లేకుండా అంతస్తులు నిర్మించిన వాటిని గుర్తించామన్నారు. కూల్చివేతల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

'పత్తికుంట చెరువును కాపాడాలి'

దుండిగల్, జులై 1(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్, బాచుపల్లిలోని పత్తికుంట చెరువును కాపాడాలని ముదిరాజ్ సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు నేషనల్ ఫెడరేషన్ ఫిషర్‌మ్యాన్ కో-ఆపరేటివ్ చైర్మన్ చిన్నంగి వెంకటేశంతో పాటు బాచుపల్లి మండల కమిటీసభ్యులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పత్తికుంట చెరువుపైన ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలతో పాటు, డీ మార్టు షాపుల వారు వదులుతున్న డ్రైనేజీ మొత్తం చెరువులోకి చేరుతుందని తెలిపారు. ఈ మధ్యకాలంలో దాదాపు రూ.2 లక్షల విలువ చేసే చేపలు చనిపోయాయని వివరించారు. దీని వలన చెరువులోని చేపల మీద ఆధారపడి జీవిస్తున్న 39 కుంటుంబాలకు జీవనోపాధి దెబ్బతిన్నదని తెలిపారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో బాచుపల్లి మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ ముదిరాజ్, జ్యోతి, సురేష్, లక్ష్మణ్, ఆగమయ్య, నరేందర్ ఉన్నారు.

విలేకరుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి


డీఈఓ విజయ్‌కుమారి వినతిపత్రం ఇస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

దుండిగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తూ, చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్టు ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా నాయకులు జిల్లా విద్యా శాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్ జిల్లా ప్రతినిధి బృందం మేడ్చల్ జిల్లా డీఈఓ విజయ్‌కుమారిని కలిశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం రాయితీ ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాస్, జిల్లా మండల స్థాయి సంఘం సభ్యులు ఉన్నారు.

ఐదు ఎకరాలలోపు రైతులకే రైతుబంధు ఇవ్వాలి


మాట్లాడుతున్న మిద్దెల బాల్‌రెడ్డి

దుండిగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకే రైతుబంధు ఇవ్వాలని బౌరంపేట పీఏసీఎస్ సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం బౌరంపేటలోని సంఘ కార్యాలయం లో అధ్యక్షుడు మిద్దెల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మేడ్చల్ సహకార సంఘం అధికారి కె.రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుబంధు గురించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై రైతులకు వివరించి చెప్పారు. అదే సమయంలో రైతుల అభిప్రాయాలను, సూచనలను తెలుసుకున్నారు. అధికారి మాధవరెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు నల్తూరి కృష్ణ, డైరెక్టర్ ఎ.వెంకటేష్ యాదయ్య, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

గచ్చిబౌలి, జులై 1(ఆంధ్రజ్యోతి): నల్లగండ్లలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సింహులు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రతి అంశాల్లో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి అన్నివిధాలు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ నాగరాజు, హెచ్‌ఓడీ రంగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

చందానగర్: చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు అందాయి. గంగారం గ్రామంలో ఇంటిముందు రోడ్డుకు అనుకుని అరుగు నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాని, సమస్య పరిష్కారంకోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, ఇప్పుడైన సమస్యను పరిష్కరించాలని కంది జ్ఞానేశ్వర్ ఫిర్యాదు చేశారు.

కుత్బుల్లాపూర్‌కు రెవెన్యూ అధికారిని నియమించాలి


వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గాజులరామారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలానికి రెవెన్యూ అధికారిని నియమించాలని మేడ్చల్ జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో సీపీఐ నాయకులు అధికారులకు వినతిపత్రం సోమవారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలానికి శాశ్వత తహసీల్దార్ లేకపోవడంతో ప్రభుత్వ భూములు అన్యాయక్రాంతం అవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుక వెళ్లారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, హరినాథ్, శ్రీనివాస్, సహదేవ్ పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్

రూ.5 లక్షల విలువ గల బంగారం, బైక్ స్వాధీనం



మాట్లాడుతున్న డీసీపీ సురేష్‌కుమార్


స్వాధీనం చేసుకున్న బంగారం

నిజాంపేట్, జులై 1(ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచర్‌ను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.5 లక్షల విలువ చేసే బంగారు నగలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ డీవీఎన్ కలిసి బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేష్‌కుమార్ నిందితుడి వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన మహేందర్‌సింగ్(35) వైజాగ్‌లో ఉంటున్నాడు. మద్యానికి బానిస కావడంతో పాటు వ్యక్తిగతంగా రూ.1.5 లక్షల లోన్ తీసుకొన్నాడు. రుణం చెల్లించలేక చైన్ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. గత నెల 24వ తేదీన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాకింగ్ చేస్తున్న ఓ మహిళ మెడలోంచి బంగారం గొలుసు లాక్కెళ్లాడు. 25న మరో మహిళ నుంచి గొలుసు చోరీ చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అదేరోజు సాయంత్రం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరో మహిళ మెడలోంచి బంగారు గొలుసును దోచుకున్నాడు. బాలానగర్ ఎస్‌ఓటీ, బాచుపల్లి పోలీసుల ఆధ్వర్యంలో మమతా ఆస్పత్రి సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న మహేందర్‌సింగ్ వాహనాన్ని తనిఖీ చేయగా రెండు బంగారు గొలుసులు దొరికాయి. అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరాలన్నీ ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.5 లక్షల విలువ చేసే బంగారు గొలుసులు, ఒక పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేటు గాడు 2012 నుంచి 2015 వరకు బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, పేట్‌బషీరాబాద్, అల్వాల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 36 గొలుసు దొంగతనాలు చేసినట్లు తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మళ్లీ 2017లో జైలు నుంచి వచ్చి, దొంగతనాలు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. కరుడుకట్టిన నేరస్థుడిని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసును ఛేదించిన బాలానగర్ ఎస్‌ఓటీ, క్రైమ్ సిబ్బంది, బాచుపల్లి పోలీసులను సురేష్‌కుమార్ అభినందించారు.

హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు

కూకట్‌పల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తిని ముగ్గురు కలిసి హత్య చేసిన ఉదంతంలో నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ కూకట్‌పల్లిలోని 6వ ఏడీజే కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. దోషులకు జీవితఖైదు విధించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ సి.పావని తీర్పు విడుదల చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగపూరి నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్‌లోని దమ్మరపోచంపల్లిలో నివాసముండే మహ్మద్ ముజాహిద్(50), యూసఫ్‌గూడలోని ప్రభాత్‌నగర్‌లో నివాసముండే మహ్మద్ జిలానీ(25), రాజేంద్రనగర్‌లోని జిన్నారం కాలనీకు చెందిన మహ్మద్ ఫిరోజ్‌ఖాన్(31)లు ముగ్గురు స్నేహితులు. నవాబ్‌సాబ్‌కుంటలోని బచారత్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్(38) ఓ కేసులో జైలుకు వెళ్లడంతో అక్కడ ఈ ముగ్గురితో పరిచయం ఏర్పడింది. నలుగురు జైలు నుంచి బయటకు వచ్చాక రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. కొద్దిరోజులకే వ్యాపార లావాదేవీల్లో గొడవలు తలెత్తాయి. ఈనేపథ్యంలోనే 2022 జూలై 31న రాత్రి ఇస్మాయిల్‌ను ముజాహిద్, జిలానీ, ఫిరోజ్‌ఖాన్‌లు మాసబ్‌ట్యాంక్ వద్దకు రమ్మని చెప్పడంతో వెళ్లాడు. లావాదేవీల విషయం మాట్లాడుతుండగానే జిలానీ తన వద్ద ఉన్న గన్‌తో ఇస్మాయిల్ తలపై కాల్చాడు. అడ్డుకోబోయిన జహంగీర్, అక్రం, గౌస్‌పాషాలపై కూడా దాడి చేసి గాయపర్చారు. ఇస్మాయిల్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు హత్య, మారణాయుధాల అక్రమ వినియోగంపై కేసు నమోదు చేసుకొన్న మాదాపూర్ పోలీసులు నిందితులను కోర్టులో హాజరు పర్చి, చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన కోర్టు ముజాహిద్, జిలానీ, ఫిరోజ్‌ఖాన్‌లను దోషులుగా నిర్ధారిస్తూ జీవితఖైదు విధించింది.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎంఏనగర్‌వాసులకు అండగా ఉంటా

మియాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంఏనగర్‌లోని ప్రజలకు అండగా ఉంటానని, అధైర్యపడొద్దని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ కాలనీలో ఎన్నోఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు హెచ్‌ఎండీఏ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం కాలనీలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంఏనగర్‌లో 30 ఏళ్ల నుంచి ఉంటున్న వారికి నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ కమిషనర్, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పేద, మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గంగాధర్, అన్వర్ షరీఫ్, కృష్ణరావు, జంగం మల్లేశ్, రాజుగౌడ్, శివ, వెంకటేష్, నరేష్, రాజు, దశరథ్, రెహ్మతుల్లా, భీమ్‌రాజు, నర్సింలుగౌడ్, నాగరాజు, పాండు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


మోతీనగర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అల్లాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. సోమవారం ఆయన మోతీనగర్‌లోని మూసాపేట్ డివిజన్ వార్డు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులతో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీల సంక్షేమ సంఘాల వారు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. అనేక కాలనీలలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, దోమల బెడద కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎంటమాలజీ సిబ్బందిని అప్రమత్తం చేసి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. శక్తినగర్ కమ్యూనిటీహాల్ పనులు, స్నేహపురి కాలనీ నాలా పనులు వేగవంతం చేయాలని సూచించారు. పనులు జరిపించటంలో ఎలాంటి జాప్యానికి తావివ్వరాదన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీసీ రమేశ్, డీఈ శ్రీదేవి, పలు శాఖల అధికారులు, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్, మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కూకట్‌పల్లి: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ బాలకృష్ణనగర్‌లో వీ 1 స్పోర్ట్స్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.

● కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కాలనీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించేందుకు మంగళవారం కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'గంజాయి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

బాలానగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధిలో గంజాయి అమ్మకాలను వెంటనే అరికట్టి, గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న వారిని శిక్షించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి బాలానగర్ సీఐ నవీన్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఐకి వినతిపత్రం అందజేశారు. గంజాయికి బానిసలైన యువత గంజాయి మత్తులో విచక్షణ మరిచి బస్తీలో ఇష్టారాజ్యంగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతాలుకు గురి చేస్తున్నారని ఆమె సీఐకి వివరించారు. గంజాయి బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పులి శివకుమార్ గౌడ్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

మల్కాజిగిరి ఎంపీగా విజయంతో బీజేపీలో ఉత్సాహం


ఓబీసీ కార్యకర్తలు, నాయకులతో డాక్టర్ ఎస్ మల్లారెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల విజయం బీజేపీ కార్యకర్తలు, నాయకుల్లో నూతన ఉత్సాహం నింపిందని మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్‌లో మేడ్చల్ జిల్లా ఓబీసీ నాయకుల పరిచయ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ తల్లి ప్రేమతో ఒక మొక్కను నాటాలని గుర్తు చేశారు. జూలై 3న స్వచ్ఛ భారత్‌లో భాగంగా మన ప్రాంతంలోని చెరువు, కుంటలను శుద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని, రాబోయేది స్థానిక ఎన్నికలు గల్లీలో గెలవడానికి ప్రధానమంత్రి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ ప్రసన్న, ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, రఘుపతి, భానుచందర్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హైదర్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్‌లో ద్విచక్రవాహనం నడుపుతూ ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీలతరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తునికి చెందిన చిన్నారావు(40) కుటుంబంతో కలిసి నిజాంపేట్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పని నిమిత్తం కేపీహెచ్‌బీ కాలనీకి ద్విచక్రవాహనంపై రాంగ్‌రూట్‌లో రోడ్డు దాటుతుండగా ఉప్పల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఎదురుగా వెళ్లి ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు పాలైన చిన్నారావును స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య

జీడిమెట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓవ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అజ్‌బెస్టాజ్ కాలనీకి చెందిన సయ్యద్ దిల్‌వార్(31) వ్యాపారం సాగిస్తుంటాడు. ఇటీవల కాలంలో తన వ్యాపారంలో నష్టం రావడంతో తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. గత నెల 30వతేదీ సాయంత్రం ఇంట్లోని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దిల్‌వార్‌కు భార్య, పిల్లలు ఉన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో గుర్రపుడెక్క పెరిగి దోమల బెడద ఎక్కువగా ఉందని పరిసర ప్రాంతాల ప్రజలు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన సోమవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి గుర్రపుడెక్కను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణలో భాగంగా ఎల్లమ్మచెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించినట్లు తెలిపారు. సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, బాలస్వామి, రాజుగౌడ్, నరసింహులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేస్తున్న వారిని శిక్షించాలి


వెంకటయ్యకు విజ్ఞప్తి చేస్తున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు

బాలానగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు విన్నవించారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం సంఘం సభ్యులంతా కలిసి బషీర్‌బాగ్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి దళితులపై జరిగే దాడులపై కమీషన్ చైర్మెన్‌తో చర్చించారు. ప్రపంచ దేశాలన్ని టెక్నాలజీతో ముందుకు వెళుతుంటే తెలంగాణలో మాత్రం అణగారిన వర్గాలపై దాడులు శోచనీయమన్నారు. భవిష్యత్తులో దాడులు జరుగకుండా దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మణ్, సంఘం సభ్యులు సదా మహేష్, వినయ్‌కుమార్, దినేష్‌కుమార్, సప్పిడి భాస్కర్, కర్క మహేష్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ పనుల పరిశీలన

బాలానగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎళ్లవేళలా ఉంటాయని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధి ప్రభాకర్‌రెడ్డి నగర్‌లో పునర్నిమిస్తున్న హనుమాన్ ఆలయం స్లాబు నిర్మాణం పనులను కార్పొరేటర్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సాగర్, రామ్‌రెడ్డి, దత్తత, బాకీ, విష్ణుముదిరాజ్, రాజ్‌కుమార్, మహేందర్, చాంద్, కన్నయ్య, సుధాకర్‌రెడ్డి, రాజు, సురేశ్ పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయం స్లాబ్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

● 1983-84 పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గచ్చిబౌలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తైన 40 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 1983-84 సంవత్సరంలో ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠశాలలోని హాస్టల్ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్ణచందర్‌రావు, అంజం రాజు, శ్రీనివాస్, సీహెచ్ రమేష్, అశోక్‌గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

పేట్‌బషీరాబాద్: మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సోమవారం పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్స్ తనిఖీలు చేసి సీసీ కెమెరాల పని తీరును అడిగి తెలుకొని, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్, డీఐ నర్సింహరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వాన పడినా నీరు నిలవొద్దు..!

● జేఎన్‌టీయూలో పరిశుభ్రతపై రెక్టార్ విజయకుమార్‌రెడ్డి పరిశీలన

హైదరాబాద్ సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ క్యాంపస్ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు వర్షాకాలపు ఇబ్బందులు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వర్సిటీ రెక్టార్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే, వర్షాలు పడినపుడు కళాశాల ఆవరణలో నీరు నిలవకుండా చూడాలన్నారు. సోమవారం యూనివర్సిటీలోని బాలుర, బాలికల హాస్టళ్లను, కళాశాల్లోని వివిధ విభాగాలను సందర్శించిన ఆయన క్యాంపస్ పరిసరాల్లో చెత్తా, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. కాలేజీ, క్యాంటీన్ పరిసరాలు శుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించేలా అధికారులను పురమాయించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. క్యాంపస్‌లో విపరీతంగా చెత్తచెదారం పోగైతే విద్యార్థులు, ఉద్యోగులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. క్యాంపస్ క్యాంటీన్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని, విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు శుచిగా, రుచిగా ఉండేలా చూసుకోవాలని మేనేజర్‌ను హెచ్చరించారు. క్యాంపస్ పరిసరాల పరిశీలనలో కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి, యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్లు, హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్లు, కళాశాల ఉద్యోగులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.